విశాలాంధ్ర గుంటూరు జిల్లా

పలస్తీనాపై మారణహోమాన్ని తక్షణమే ఆపాలి

దాడులకు నిరసనగా 11న వామపక్షాల ఆందోళనలు: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: పలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు, మారణ హోమాన్ని తక్షణమే ఆపేయాలని, దాడులకు నిరసనగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన జిల్లా వ్యాప్తంగా నిరసన, ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో వామపక్ష పార్టీల జిల్లా నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జంగాల అజయ్ కుమార్, సీపీఐ ఎమ్మెల్ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి మన్నవ హరిప్రసాద్, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, సీపీఎం జిల్లా నాయకులు కంచుమాటి అజయ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ గత నెల రోజులుగా ఇజ్రాయెల్ సేనలు పాలస్తీనా ప్రజలపై దారుణ హత్యాకాండను కొనసాగిస్తుందని, గాజా ప్రాంతం మొత్తాన్ని 'ఓపెన్ జైలు" గా మార్చి తాగునీరు, ఆహారం, మందులు, విద్యుత్ బంద్ చేసి ప్రజలు ఆకలితో బలయ్యేటట్లు చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ ప్రజానీకం మొత్తం వ్యతిరేకిస్తున్నా పశ్చిమ దేశాల మద్దతుతో ఇజ్రాయిల్ పాలస్తీనాకు వ్యతిరేకంగా కుట్రలు నిరంతరం సాగిస్తునే ఉందన్నారు. కాల్పుల విరమణ పిలుపును తిరస్కరిస్తున్న అమెరికా, బ్రిటన్, జర్మనీల సరసన ప్రధాని మోడీ ఉండటం దారుణం అన్నారు. ఇజ్రాయిల్ దాడిని ఖండిస్తూ జరిగిన ఐక్యరాజ్య సమితి ఓటింగ్‌పై భారత్ గైర్హాజరవటం దేశ ప్రజలను అవమానించటమేనన్నారు. పాలస్తీనా సంఘీభావ ఉద్యమాన్ని బలోపేతం చేయటం ద్వారా యూదు దురహంకార ఇజ్రాయిల్ కుట్రలను తిప్పికొట్టాలన్నారు. ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండకు వ్యతిరేకంగా 11న జరిగే ఆందోళన కార్యక్రమంలో మేధావులు, ప్రజాసంఘాలు, ప్రజలు అందరూ పాల్గొని ఖండించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఎంపి.రాందేవ్, రాష్ట్ర కమిటీ సభ్యులు లోకం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సదస్సు జయప్రదం చేయండి: మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాష్ట్రంలో వృద్ధులు, వితంతువులు, చేనేత, గీత, మత్స్య, కళాకారులు, ఒంటరి మహిళలు, విభిన్న ప్రతిభావంతులు, వికలాంగులకు అందజేస్తున్న సామాజిక పెన్షన్లను పెంపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగే సామాజిక పెన్షనర్ల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోటమాల్యాద్రి పిలుపునిచ్చారు. మల్లయ్య లింగం భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాల్యాద్రి మాట్లాడుతూ సంక్షేమ పెన్షన్‌దారులకు పెన్షన్ రూ.2,750ల నుంచి రూ.6వేలకు పెంచాలని, భార్య, భర్త జీవించి ఉంటే ఇరువురికీ పెన్షన్ సదుపాయం కల్పించాలని, విభిన్న ప్రతిభావంతులు, వికలాంగులకు ఇస్తున్న పెన్షన్ రూ.3వేల నుంచి రూ.7వేలకు పెంచి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వయోవృద్ధులు తమ జీవిత కాలాన్ని కుటుంబ కోసం సమాజ అభివృద్ధి కోసం అంతిమంగా దేశ ప్రయోజనాల కోసం తమ శక్తి సామర్థ్యాలను ధారపోసి అలిసిపోయి ఉన్నారని వాళ్ళు జీవన రంగాల్లో అలుపెరగక శ్రమించిన కార్మిక, కర్షక, నిరుపేద వర్గాల వారికి వృద్ధాప్యంలో గౌరవంగా జీవించడానికి తగినంత పెన్షన్ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆయన తెలిపారు. పెన్షనర్లు, పెన్షన్ ఆశించేవారు విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయానికి తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు జి.సురేష్ బాబు, రావుల అంజిబాబు, చల్లా మరియదాసు, సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వర్లు (చిన్న) పాల్గొన్నారు.

పెన్షన్లు పెంచాలని సీపీఐ వినతి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: పెన్షన్ దారులకు సామాజిక పెన్షన్లు పెంపుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక పాత గుంటూరులోని పార్క్ సెంటర్ వద్ద ఉన్న 15వ సచివాలయంలో సచివాలయ సెక్రెటరీకి సీపీఐ 8వ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో డివిజన్లో ఉన్న పెన్షన్‌దారులతో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు జంగాల చైతన్య మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు, వైద్యం, మందులు తదితరాల ధరలు అపరిమితంగా పెరిగిపోయాయి. పెరుగుతున్న జీవన వ్యయానికి తగు విధంగా అన్ని రకాల పెన్షన్లు పెంచాలన్నారు. బడుగు, బలహీన వర్గాల వారికి వృద్ధాప్యంలో గౌరవప్రదంగా జీవించడానికి తగినంత పెన్షన్ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. 10న విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయంలో జరుగు పెన్షనర్ల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పెన్షనర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో 8వ డివిజన్ శాఖ కార్యదర్శి కట్టా శ్రీనివాసరావు, సాయి బాబు, మోతుకూరి సాంబశివరావు, సీతారామయ్య మలిశెట్టి, శేఖర్, సాంబశివరావు, అంబటి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

26న సివిల్స్, గ్రూప్ పరీక్షలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: యూపీఎస్సీ ప్రతి సంవత్సరం భర్తీ చేసే ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్, ఏపీపీఎస్సీ త్వరలో విడుదల కానున్న గ్రూప్-1, గ్రూప్-2 పోస్టుల నోటిఫికేషన్లు గురించి, నూతన సిలబస్ పరీక్షా విధానం, ప్రిపరేషన్ విధానం గురించి ఈ నెల 26న ఉదయం 10 గంటలకు స్థానిక పొన్నూరు రోడ్డులోని టార్గెట్ ఐఏఎస్ అకాడమీలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ అన్నపురెడ్డి ఉషారాణి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి గల ఏదైనా డిగ్రీ చదివిన, చదువుతున్న యువతీ యువకులు మీ పేరు, విద్యార్హత వివరాలను 9010304089, 9030562728, 8885872889 నంబర్లకు ఫోన్ చేసి రిజిస్టర్ చేసుకోవచ్చు. అవగాహన సదస్సుకు హాజరైన వారికి జనరల్ స్టడీస్ అంశాలపై 100 మార్కులకు మెరిట్ పరీక్ష ఉంటుందని, వారికి కోచింగ్ ఫీజులో 90శాతం వరకు రాయితీ ఉంటుందని, నవంబర్ 27 నుండి కోచింగ్ ప్రారంభం అవుతుందని తెలిపారు.

శ్రీచైతన్య విద్యార్థులకు నాసా కిట్లు అందజేత

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక రెడ్డిపాలెం రోడ్డులో ఉన్న శ్రీచైతన్య రెసిడెన్షియల్ పాఠశాలలో అమెరికా వారు నిర్వహించే స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌కు 71 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ యూనివర్శిటీ ఆచార్యులు (డీమ్డ్)డాక్టర్ బి.నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు నాసా కిట్లు అందజేశారు. అనంతరం నాగేశ్వరరావు భవిష్యత్‌లో సైన్స్ ప్రాధాన్యత.. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి గురించి తెలియజేసి విద్యార్థులను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యా సంస్థల ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య, ప్రిన్సిపల్ టి.ముని సరిత, జోనల్ అకడమిక్ డీన్ బి.నాగరాజు, కో-ఆర్డినేటర్ మూర్తి, నాసా ఇన్‌ఛార్జ్ శేషగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

అందరికీ సమాన న్యాయం జరగాలి

విశాలాంధ్ర-తెనాలి : మండల న్యాయ సేవాధికార సంస్థ తెనాలి వారి ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో న్యాయసేవా దినోత్సవ వేడుకలు జరిగాయి. అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్ మాట్లాడుతూ కుల మత వర్గ లింగ వివక్షత లేకుండా సమాజంలోని అర్హులైన అన్ని వర్గాల ప్రజలకు సత్వర న్యాయం జరగాలన్నదే లక్ష్యమని అన్నారు. 1987లో ప్రారంభమైన ఈ కార్యక్రమం 1995 నవంబర్ 9న చట్ట రూపం దాల్చిందన్నారు. దీని ప్రభావంతో చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, రాజీమార్గమే రాజమార్గమని సమయం ధనం వృధా కాకుండా లోక్ అదాలత్‌లు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి పి.రాజశేఖర్, 2వ అదనపు జూనియర్ జడ్జి జి.సీత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు మందలపు వేణుగోపాల్, సెక్రటరి హరిదాసు గౌరీశంకర్, పానల్ అడ్వకేట్స్, 2టౌన్ సిఐ వెంకటరావు, యస్ఐలు, పారాలీగల్ వాలంటీర్లు ప్రభృతులు పాల్గొన్నారు.

సాయిబాబా గౌడ్ ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర-తెనాలి : పట్టణంలో వేంచేసియున్న వైకుంఠపురం శ్రీ లక్ష్మీపద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థాన ట్రస్టు బోర్డు ఛైర్మన్‌గా కుంభం సాయిబాబా గౌడ్, సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ మహోత్సవానికి తెనాలి శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని వారిని అభినందించారు. ముందుగా గౌడకాలనీ నుండి ఊరేగింపుగా ట్రస్టుబోర్డు ఛైర్మన్ సాయిబాబా గౌడ్, సభ్యులు పెద్ద ర్యాలీతో దేవస్థానం చేరుకున్నారు. అభిమానులు, బంధుమిత్రులు విశేషంగా పాల్గొని పూలదండలతో వారిని సత్కరించారు.

షాపులకు బహిరంగ వేలం

విశాలాంధ్ర-పొన్నూరు : ఈ నెల 16న పొన్నూరు పురపాలక సంఘ పరిధిలోని రాజీవ్ గాంధీ, ఇందిరాగాంధీ, మాంసం మార్కెట్, కొప్పాక వెంకయ్య కూరగాయల మార్కెట్‌లో షాపులు 3సంవత్సరాల అద్దె ప్రతిపాదికన బహిరంగ వేల నిర్వహించబడునని మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ గురువారం తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు సాల్వెన్సీ, ఈసీ ఒరిజినల్స్, ఆధార్, పాన్‌కార్డు జిరాక్స్ కాపీలు జతచేసి కార్యాలయంలో అందచేయాలని కమిషనర్ తెలిపారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

12.2 మి.మీటర్ల వర్షపాతం నమోదు

విశాలాంధ్ర-పొన్నూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో పొన్నూరు మండలంలో గడిచిన 24 గంటల్లో 12.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు మండల తహసిల్దార్ శ్రీకాంత్ కేదార్నాథ్ గురువారం తెలిపారు. వర్షపాతానికి ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదని పేర్కొన్నారు. వర్షపాతం వ్యవసాయానికి అనుకూలంగా ఉందని ఆయన వెల్లడించారు.

లబ్ధిదారుల జాబితా బోర్డులు ఏర్పాటు

విశాలాంధ్ర-పొన్నూరు : పట్టణంలోని అన్ని సచివాలయాల్లో గురువారం నుంచి లబ్ధిదారుల జాబితా బోర్డులో ఏర్పాటు చేయనున్నట్లు సంబంధిత అధికారులు మీడియాకు తెలిపారు. 9న సాంబశివ నగర్ కాలనీ, 10న జెండా చెట్టు, 14న క్యాబిన్ పేట, 15న నాగుల చెరువు, 16న జై భారత్ రెడ్డి నగర్, 17న డిఆర్‌కే కాలనీ, 20న టీచర్స్ కాలనీ, 21 ఇందిరా కాలనీ, 22, 23న ఎస్సీ, ఎస్టీ కాలనీలోని 1, 2 సచివాలయాలలో బోర్డులు ఏర్పాటు చేయనున్నారు.

ఎంసెట్ 3వ విడత కౌన్సిలింగ్‌పై ధన్యవాదాలు

విశాలాంధ్ర-మంగళగిరి: ఎంసెట్ మూడవ కౌన్సిలింగ్ అనుమతి ఇచ్చిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకి, ఉన్నత విద్యా శాఖ మండలి ఛైర్మన్ హేమచంద్ర రెడ్డికి అఖిల భారత విద్యార్థి సమాఖ్య సమితి పక్షాన ధన్యవాదాలు తెలియజేశారు. ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానాల శివారెడ్డి, రాష్ట్ర కోశాధికారి మండగళ్ల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న సినిమాలకూ అవకాశం కల్పించాలి: సుమన్

విశాలాంధ్ర-తాడేపల్లి: ఏపీలో తెలుగు ఇండస్ట్రీ అభివృద్ధి చెందాలంటే చిన్న సినిమాలకు కూడా అవకాశం కల్పించాలని సినీ నటుడు సుమన్ అన్నారు. గురువారం తాడేపల్లి సుందరయ్య నగర్ కట్ట వద్ద ఆంధ్రప్రదేశ్ ఫిలిమ్ ఛాంబర్ అఫ్ కమర్స్ నూతన కార్యాలయాన్ని సుమన్ ప్రారంభించారు. ముందుగా కార్యక్రమానికి విచ్చేసిన సుమన్‌కు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వదించారు. అనంతరం నిర్వాహకులు ఆయనకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ... తెలుగు సినిమా పరిశ్రమ మరింత అభివృద్ధి జరగాల్సిన అవసరం వుందన్నారు. చిన్న సినిమాలకు అవకాశం ఇస్తే ఇండస్ట్రీ పదికాలాలు పచ్చగా వుంటుందని తెలిపారు. చిన్న సినిమాలను ప్రోత్సహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వాటి ప్రదర్శన కోసం చిన్న థియేటర్లు గవర్నమెంట్ అధ్వర్యంలో పనిచేయాలని సూచించారు. సినిమా పరిశ్రమలో అత్యధికంగా నష్టపోయేది డిస్ట్రిబ్యూటర్లే అని వారిని ఆదుకునే నాధుడే వుండరని సుమన్ అన్నారు. డిస్ట్రిబ్యూటర్ ఉంటేనే చిన్న సినిమాకు మనుగడ వుంటుందన్నారు. ఏపీ ప్రభుత్వం కూడా సినిమాలకు టాక్స్ బెనిఫిట్స్, షూటింగ్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు.

హవాల్దర్ కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : విధి నిర్వహణలో గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోయిన సీజీఎస్‌టీ శాఖకు చెందిన హెడ్ హవల్దార్ సీహెచ్.వెంకటేశ్వర్లు కుటుంబానికి సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి, వారి సిబ్బంది ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా జీఎస్టీ కమిషనర్ నరసింహారెడ్డి చేతుల మీదుగా రూ.2,06,000 నగదును వెంకటేశ్వర్లు కుమార్తెలు నాగవర్ధని, కరుణలకు గురువారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అశువులు బాసిన కుటుంబాలకు తాము అండగా ఉంటామన్నారు. చిత్తశుద్ధితో పని చేసే వెంకటేశ్వర్లు ఉద్యోగపరంగా పలు అవార్డులు అందుకున్నట్లు చెప్పారు. ఆయన మృతి విచారకరమని, శాఖాపరంగా రావాల్సిన అన్ని ప్రయోజనాలతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామన్నారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా సమిష్టిగా సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ జాయింట్ కమిషనర్ రామకృష్ణ రాజు యాదవ్, అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్, సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, మూర్తి, నవీన్, ఈశ్వరరావు, కాకర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆచార్యులుగా ఫార్మశీ కళాశాల అధ్యాపకులు పదోన్నతి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : హిందూ ఫార్మశి కళాశాలలోని ముగ్గురు అధ్యాపకులు ఆచార్యులుగా పదోన్నతి పొందినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫార్మా కెమిస్ట్రి విభాగంలో డాక్టర్ ఎస్.ఉదయవాణి, ఫార్మాస్యూటిక్స్ విభాగంలో డాక్టర్ ఎ.రాజేష్, డాక్టర్ వి.వాసు నాయక్‌లు చేసిన పరిశోధనలకు పీహెచ్‌డీ అవార్డు పొందటం..10 సంవత్సరాల అనుభవం ఉన్నందున వారిని కళాశాల యాజమాన్యం ఆచార్యులుగా నియమించారు. డాక్టర్ ఎస్.ఉదయవాణి ఆంధ్ర విశ్వవిద్యాయంలోని డాక్టర్ గిరిజా శాస్త్రి పర్యవేక్షణలో నాణ్యమైన ముడి పదార్థాల తయారీ, విశ్లేషణపై డాక్టర్ ఎ.రాజేష్ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ ఎ.పరమేశ్వరి పర్యవేక్షణలో ఫ్లోటింగ్ టాబ్లెట్స్‌పై. డాక్టర్ వి.వాసు నాయక్, విష్ణు కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ మోహన వర్మ పర్యవేక్షణలో మెరుగైన విటమిన్-బి.1 టాబ్లెట్స్ తయారీపై పరిశోధనలు చేసి డాక్టరేట్ డిగ్రీలు పొందారు. అనంతరం కళాశాల ఛైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ తమ కళాశాలలో 44 మంది అధ్యాపకులు ఉండగా, వారిలో 14 మంది డాక్టరేట్ పొందటం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూధనరావు మాట్లాడుతూ ఫార్మశి అధ్యాపకులు ఫార్మశి విద్యలో నాణ్యతా ప్రమాణాలు అమలు చేస్తూ విద్యను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : బొర్రావారిపాలెంలో మహాలక్ష్మమ్మ వృద్ధాశ్రమంలో వృద్ధులకు దాతల సహకారంతో దుప్పట్లు పంపిణీ చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రామిశెట్టి అదేశ్వరరావు మాట్లాడుతూ చలికాలం సమీపిస్తుండటంతో అందరి ఆనందం గ్రూప్ దాతల సహకారంతో దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అందరి ఆనందం ఎస్. వీరాంజనేయులు, దాతలు పాల్గొన్నారు.

మరోసారి నోటిఫికేషన్ల గారడీ : సాయికృష్ణ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: వైసీపీ ప్రభుత్వ హామీలు ఇస్తామన్న జాబ్ క్యాలెండర్ నోటిఫికేషన్లు అన్ని "ఒట్టి విస్తరాకు మంచి నీళ్ళే" అని ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మరోసారి నోటిఫికేషన్ల గారెడితో నిరుద్యోగులను మరో మోసానికి తెర తెయ్యబోతున్నారని గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ దుయ్యబట్టారు. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన, ఇస్తామని ప్రకటించనున్న నోటిఫికేషన్లు "ఒట్టి విస్తరాకు పరిచి మంచి నీళ్లు ఇచ్చి పొమ్మన్నట్లు ఉందని "చూపుతూ జాబ్ క్యాలెండర్ డిమాండ్ చేస్తూ గుంటూరు లోని జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసు వద్ద జిల్లా సాయి కృష్ణ ఆధ్వర్యంలో కాళీ విస్తరాకులు మంచి నీళ్ళ గ్లాసుల ఎదుట పెట్టుకొని గత నాలుగేళ్ళ జాబ్ క్యాలెండర్ల నోటిఫికేషన్ల స్టిక్కర్లను వడ్డించే ఖాళీ బక్కెట్లకు అంటించి ఖాళీ గంటలతో వడ్డన చెస్తున్నట్లు స్కిట్ ప్రదర్శించి వినూత్న రీతిలో నిరసన తెలియజేసారు. కార్యక్రమాన్ని మధ్యలో పోలీసులు బలవంతంగా అడ్డుకుని జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణతో పాటు రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్ లను అరెస్ట్ చేసి పట్టాభిపురం పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసిన అనంతరం నోటీసులు ఇచ్చి స్టేషన్ బెయిల్ పైన విడుదల చేశారు. సాయి కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగాల విప్లవం తీసుకొస్తామని ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సిలు ప్రకటిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి అందుకు బిన్నంగా మాట తప్పి మడమ తిప్పి నిరుద్యోగ యువత ఆకాంక్షలను తొక్కేసారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో యువత విద్యార్థుల నిరుద్యోగుల ఓట్ల కోసమే ఏపీపీయస్సితో మళ్ళీ ప్రకటన చేపించి నిరుద్యోగులను మళ్ళా మోసం చేసే కుట్ర చేస్తున్నారన్నారు.

చంద్రబాబుతోనే భవితకు గ్యారెంటీ : డాక్టర్ నిమ్మల

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే ప్రతి ఒక్కరి భవితకు నమ్మకమైన గ్యారెంటీ ఉంటుందని టీడీపీ బీసీ సీనియర్ నాయకులు, ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ నిమ్మల శేషయ్య అన్నారు. గురువారం స్థానిక నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్ ప్రాంతంలో పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర ఆధ్వర్యంలో జరిగిన "బాబుష్యూరిటీ- భవిష్యత్తు కు గ్యారెంటీ" కార్యక్రమంలో నిమ్మల శేషయ్య పాల్గొని ఇంటింటికి వెళ్లి మహిళలు, యువతతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. నగరంలో మినీ మేనిఫెస్టో కరపత్రాలను అందజేసి టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సంక్షేమ పథకాలు మహాశక్తి, యువగళం, అన్నదాత, ఇంటింటికీ నీరు, పూర్ టు రిచ్, బీసీ రక్షణ చట్టం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ఒక విజన్ ఉన్న నాయకుడని.. రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు మళ్లీ సీఎం కావాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తెదేపా గెలుపు అత్యవసరమన్నారు. ఏపీ అభివృద్ధి చంద్రబాబుతోనే ముడిపడి ఉందన్నారు.

నాక్ గుర్తింపునకు వెళుతున్న 'సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల'

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల నాక్(ఎన్ఏఏసీ) గుర్తింపునకు సిద్ధమవుతున్న తరుణంలో కళాశాలను సందర్శించడానికి మాక్ పీర్ కమిటీ సభ్యులుగా ఆచార్య సిరిపురం శంకర్, అడ్వైజర్ ప్రిన్సిపాల్ ఏఎస్ఆర్ కళాశాల గుడివాడ, మెంటర్ జెకెసి కళాశాల సభ్యులు ఎస్ఆర్‌కె ప్రసాద్, పీజీ కోర్సుల డైరెక్టర్ గోపీచంద్, వైస్ ప్రిన్సిపాల్ కోఆర్డినేటర్ జెకెసి కళాశాల వారు కళాశాలకు విచ్చేసి అనంతరం కళాశాలలో ప్రతి విభాగమును సందర్శించి సమయ స్ఫూర్తిదాయకమైన పలు సూచనలు సలహాలు తెలియపరిచారు. కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ డాక్టర్ సిస్టర్ ఫాతిమారాణీ రాని మాక్ పీర్ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

పేరుకే 30 పడకల ఆసుపత్రి..



విశాలాంధ్ర-పొన్నూరు : పేరుకే 30 పడకల వైద్యశాల అని ప్రగల్భాలు పలుకుతున్న నిడుబ్రోలు ప్రభుత్వ వైద్యశాలలో తాగునీరు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. వైద్యశా లలో వాటర్ ప్లాంట్‌తో పాటు చేతి పంపు కూడా చెడిపోయింది. దీంతో వైద్యశాలలో ఉండే రోగులకు, సిబ్బందికి త్రాగునీరు లేక అల్లాడుతున్నారు. వారం రోజుల నుంచి సమస్య పదిలంగా ఉన్న చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. వైద్యశాల అభివృద్ధి కమిటీ పట్టించుకోవడంలేదని ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

రోగులకు ఇబ్బందులు కలుగజేస్తే కఠిన చర్యలు: డీఎంఈ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ సమగ్ర (జీజీహెచ్)ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు సంతృప్తిగా ఉన్నాయని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)డాక్టర్ నరసింహన్ అన్నారు. గురువారం జీజీహెచ్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్యాజువాల్టి, కాన్పుల వార్డు, 24 గంటల బ్లడ్‌బ్యాంక్, అత్యవసర ఆపరేషన్ థియేటర్, ఐసీయూ, ఛాంబర్స్, జగనన్న ఆరోగ్య సురక్ష సమాచార సహాయ కేంద్రాన్ని పరిశీలించారు. ఆసుపత్రిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను కూడా పరిశీలించారు. కొత్తగా చేపట్టిన ఈసీజీ, ఎక్సరే గదులను పరిశీలించారు. సిటీ స్కాన్ పరికరం రావడం కోసం కొంత సమయం పట్టే అవకాశం ఉందని, రిపేరులో ఉన్న సిటీ స్కాన్ మిషన్‌ను త్వరలో అందుబాటులో తీసుకొస్తామన్నారు. రెండో సిటీ స్కాన్ పరికరం మంజూరు చేసినందుకు డీఎంఈకి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. గుండె ఆపరేషన్‌ల వార్డును పరిశీలించి ఆపరేషన్లు చేసుకున్న పేషంట్లతో కాసేపు మాట్లాడారు. పేషంట్లకు సిబ్బంది ఇబ్బందులు పెట్టినట్లు మా దృష్టికి వస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిటీవీఎస్ విభాగం ప్రభుత్వ ఆదేశాల మేరకు పని చేయాలని, లేనిపక్షంలో వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆపరేషన్ థియేటర్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, ఆపరేషన్ థియేటర్ కొరత వల్ల ఆపరేషన్లు ఆలస్యం అవుతున్నాయన్న అపవాదులు రాకుండా చూడాలని సూచించారు. కాన్పుల వార్డులో ఒకే మంచంపై ఇద్దరేసి గర్భిణులు ఉండటాన్ని ఆయన గమనించారు. నిర్మాణంలో ఉన్న మాత శిశు సంరక్షణ కేంద్రం పూర్తయితే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్‌కుమార్, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

లింక్ డాక్యుమెంట్ పోయినది

గుంటూరు సిటీ, సౌభాగ్యనగర్ 2వలైను డోర్ నెం.4-22-27/డి1 కాపురస్తులైన **కొల్లి రమాదేవి, భర్త (లేటు) కొల్లి సుబ్బారెడ్డి** గారి **లింక్ డాక్యుమెంట్ నెం. 1815/1984** తాడికొండ మండలం, కొప్పురావూరు గ్రామంకు చెందిన ఒరిజినల్ దస్తావేజు కవరు **ది.7-10-2022**న నందివెలుగులోని నా బంధువుల ఇంటికి ఆటోలో వెళ్ళుచుండగా మార్గమధ్యలో పోయినది. కావున ఎవరికైనా దొరికినచో పై అడ్రస్‌కుగాని ఈక్రింది **ఫోన్ నెం. 9966095666**కు తెలుపగలరు.

టపాసులతో జాగ్రత్త: డా॥అనూష

విశాలాంధ్ర-మంగళగిరి: దీపావళికి పర్యావరణ హితమైన పదార్థాలతో తయారు చేసిన టపాసులు కాల్చి జాగ్రత్తలు పాటిస్తూ పండుగను ఆనందోత్సవాలతో జరుపుకోవాలని మంగళగిరి గణపతి నగర్లోని ఇందిరా నగర్ డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ పీ అనూష అన్నారు. టపాసులు కాల్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తక్కువ విషవాయువులను విడుదల చేసే గ్రీన్ కాకర్స్ కాల్చడం మంచిదన్నారు. ప్రమాదవశాస్తు చేతులు, శరీరం కాలితే కాలిన ప్రదేశాన్ని చల్లని నీటితో కడిగి కొబ్బరి నూనె రాయాలన్నారు. ఐసు, వెన్న పెట్టరాదు అన్నారు. గర్భిణీ మహిళలు, గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు బాణాసంచా కాల్పుల పెద్ద శబ్దాలకు దూరంగా ఉండాలన్నారు. టపాసులు కాల్చేటప్పుడు పక్కనే బకెట్‌తో నీరు పెట్టుకొని కాళ్లకు చెప్పులు, వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలన్నారు. టపాసులు కాల్చే సమయంలో జరిగిన ప్రమాదాల తీవ్రతలను బట్టి సమీపంలోని హెల్త్ సెంటర్లలోని వైద్యులను సంప్రదించి వైద్య సేవలు పొందాలని ఆమె అన్నారు.

పెన్షన్ పెంచాలని కరపత్రాలు పంపణీ

విశాలాంధ్ర-ప్రత్తిపాడు: వృద్ధులు, వితంతువులు తదితర సంక్షేమ పెన్షన్దారులందరికీ పెన్షన్ నెలకు రూ.6వేలకు పెంచాలని, అర్హత కలిగిన భార్యా భర్తలు జీవించి ఉంటే ఇరువురికి పెన్షన్ సదుపాయం కల్పించాలని, 50 సంవత్సరాల నుండి అర్హతలు కలిగిన వారందరికీ పెన్షన్ సదుపాయం కల్పించాలని, విభిన్న ప్రతిభావంతులు లేక వికలాంగులకు ఇస్తున్న పెన్షన్ అను నెలకు రూ.3000 వేల నుండి 7వేలకు పెంచి అందించాలని స్థానిక ప్రత్తిపాడు నియోజకవర్గంలో నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వర రావు, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి కుంచాల అంకమ్మరావు, సహాయ కార్యదర్శి ఎస్ వీరాంజనేయులు, కే జగదీష్, పార్టీ కార్యకర్తలు కరపత్రాలు పంపిణీ చేశారు.

మహిళలకు కుట్టుమిషన్లు పంపిణి

విశాలాంధ్ర-మంగళగిరి : మహిళాభ్యున్నతే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్త్రీ శక్తి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి తెలిపారు. స్త్రీ శక్తి ద్వారా దుగ్గిరాల మండలంలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంగళగిరి టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో గురువారం నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు, కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. 30వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన 50 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. తమ కాళ్ళపై తాము నిలబడేందుకు నారా లోకేష్ ఇస్తున్న సహకారం ఎప్పటికీ మర్చిపోలేమని కుట్టు మిషన్లు అందుకున్న లబ్దిదారులు నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, రాష్ట్ర తెలుగు మహిళ కార్యదర్శి వింజమూరి అషాబాల, తదితరులు పాల్గొన్నారు.

16న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి గుంటూరులో ఈ నెల 16న చేపట్టబోయే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గుంటూరు తూర్పు బీజేపీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ ఎస్.ఉమాశంకర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం బీజేపీ 6వ మండల శక్తి కేంద్రాల ప్రముఖులు, బూత్ ఇన్‌ఛార్జ్‌లను నియమిస్తూ మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఉమా శంకర్ మాట్లాడుతూ ఓటరు లిస్టులో అవకతవకలను పరిశీలించి బీజేపీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసేందుకు దగ్గుబాటి పురంధేశ్వరి రానున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భారీగా ఓటర్ లిస్టులో దొంగ ఓట్లు చేర్చడం..అలాగే అధికార దుర్వినియోగం చేస్తూ ఓటర్ లిస్ట్ ఎలక్షన్‌లో అవకతవకలు పాల్పడడానికి ఖండిస్తూ కమిషనర్‌కు.. నోడల్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 6 మండల అధ్యక్షులు సురేష్, కుమార్ గౌడ్, పోతురాజు వెంకట్, శేషగిరి, దేవిశెట్టి బాబూరావు, తల్లం మనోజ్, అంకాల శ్రీనివాస్, సుధాకర్ బాబు, గుప్తా, దుర్గ భవాని తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సదస్సు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-మంగళగిరి: ఆత్మకూరులో వృద్ధాప్య, వితంతు, వికలాంగ పెన్షన్ దారులకు ఇస్తున్న పెన్షన్ ను వృద్ధులకు, వితంతలకు రూ. 6000, వికలాంగులకు రూ.7000 పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10 వ తేదీన విజయవాడలో జరుగు రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని, ఆత్మకూరు గ్రామంలో గురువారం సిపిఐ నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, పంతగాని మరియదాసు, గ్రామ సిపిఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరు సిటీ, బృందావన గార్డెన్స్, ఎన్‌టీఆర్ వీధి, శ్రీ ధర్మశాస్త నిలయం, ఫ్లాట్ నెం.4422రు కాపురస్తురాలు టి.వి.యన్. సత్యనారాయణ గారి భార్య తల్లపనేని వెంకాయమ్మ గారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది.

నా క్లయింటు పేరిటకు ది. 21-07-1982న శ్రీ గుంటూరు సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో రిజిష్టరు కాబడిన విక్రయ దస్తావేజు నెం. 7108/1982రు గల ఒరిజినల్ దస్తావేజు ది.02-11-2023 న తన ఇంటి వద్ద నుండి గుంటూరు సిటీ, బృందావన గార్డెన్స్ సెంటర్‌కు జిరాక్సు నిమిత్తం వెళ్ళుచుండగా పోగొట్టుకున్నారు. కావున సదరు దస్తావేజు ఎవరికైననూ దొరికిన యెడల నాకు గానీ, నా క్లయింటుకు గానీ అందజేసిన యెడల నా క్లయింటు నుండి తగిన పారితోషికం ఇవ్వబడునని తెలియజేయడమైనది.

సయ్యద్ ఆసిఫ్ అలీ, అడ్వకేట్, కొబాల్డ్‌పేట, గుంటూరు. సెల్ నెం. 93941 55522

PEOPLES MUTUALLY AIDED CO-OPERATIVE CREDIT SOCIETY LTD

Estd 2013

REG NO AMC/KNA/DCO/2013/44

D.No.33-12-9, Boyapativari Street, Seetharampuram, Vijayawada, NTR District, Andhra Pradesh-520002

NOTICE

Notice is hereby given to the Members of the Peoples Mutually Aided Co-Operative Credit Society Ltd.,Reg No AMC/KNA/DCO/2013/44 to attend the General Body Meeting to be held on 02-12-2023 at 5:00PM at PB SIDDHARTHA ARTS & SCIENCE COLLEGE, MOGALARAJAPURAM, VIJAYAWADA -10, to discuss the given below Agenda.

AGENDA

1. To read and confirm the minutes of 10th Annual General Body Meeting held on 26-08-2023.
2. Approval for Amendments to Bye-Law No. 1(ii), 7, 18(a), 42(V), 43(a)(d)(l), 46(A), 51(A).
3. Any other matter with the permission of the chair.

(By Order of the Board)

Sd/- K.Karthik,
Chief Executive Officer
Peoples Mutually Aided Cooperative Credit Society Limited, Vijayawada.

Place:Vijayawada
Date:08-11-2023

విశాలాంధ్ర
పల్నాడు జిల్లా

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

విశాలాంధ్ర-సత్తెనపల్లి: విద్యార్థినీలు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యశించాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాదికార కమిటీ చైర్మన్ డి.నాగ వెంకటలక్ష్మి కోరారు. గురువారం స్థానిక కస్తూరిబా బాలికల పాఠశాలలో న్యాయ సేవాదినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లడుతూ చట్టం నిరుపేద, మధ్యతరగతి విద్యార్థుల కొరకు విద్యాపరమైన చట్టాలు, వీరికి సామాజిక పరంగా రక్షణ కొరకు అనేక చట్టాలు పటిష్టంగా అమలు పరుస్తున్నారన్నారు. ఈ రోజునే న్యాయ సేవా దినోత్సవం జరుపుకోవటానికి గల కారణాలు, చట్టాలను గురించి వివరించారు. అనంతరం పాఠశాల పరిసరాలు, వంటశాలను, ఆహార పదార్థాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్‌కి సూచనలు చేశారు. రిజిష్టర్, రికార్డులను పరిశీలించారు. పాఠశాల వెనుక మురుగు నీరు నిల్వ ఉండి దోమల బెడద, తీవ్ర దుర్గంధంగా ఉండటాన్ని పరిశీలించారు. సత్తెనపల్లి ప్రభుత్వ న్యాయవాది షేక్ బాలి షేద్, సీనియర్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, ప్యానల్ న్యాయవాది బి.ఎల్.కోటేశ్వరరావు, ప్రిన్సిపల్ ప్రసన్న రాణి, పారా లీగల్ వాలంటీర్లు షేక్ ఖాజా, షేక్ ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రకళా పోటీలో వల్లం కృష్ణకు జ్యూరీ అవార్డు

విశాలాంధ్ర-వినుకొండ రూరల్: చోడవరం చిత్రకళ నిలయం సంస్థ నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రకళా పోటీలలో వినుకొండ మండల పరిధిలోని గోకొనకొండ గ్రామానికి చెందిన యువ చిత్రకారుడు వల్లం కృష్ణకు ప్రత్యేక జ్యూరీ అవార్డు లభించింది. పోటీలలో కృష్ణ చిత్రించిన "మాతృత్వం"చిత్రానికి జాతీయస్థాయిలో అవార్డు లభించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విజేత కృష్ణను పట్టణానికి చెందిన పలువురు కవులు కళాకారులు అభినందించారు.

ఎస్ఐని సత్కరించిన జనసేన నేతలు

విశాలాంధ్ర-బొల్లాపల్లి: వినుకొండ పట్టణ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తు సాధారణ బదిలీలలో భాగంగా బొల్లాపల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీ బాధ్యతలు చేపట్టిన ఎస్సై చెన్నకేశవులను జనసేన పార్టీ గొల్లపల్లి మండల అధ్యక్షుడు రాజా నాయక్, ఈపూర్ మండల అధ్యక్షులు భాస్కర్ నాయక్, శావల్యాపురం మండల అధ్యక్షులు అడపాల అనిల్ కుమార్, పారేళ్ళ అభిమానులు ఎస్సై చెన్నకేశవులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

విశాలాంధ్ర-దుర్గి: ప్రమాదవశాత్తు విద్యుత్ షాట్ సర్క్యూట్ సంభవించి ఇల్లు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని అడిగొప్పల గ్రామంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన టెరబోయిన బాబు గృహంలో ప్రమాదశాత్తు విద్యుత్ షాట్ సర్క్యూట్ సంభవించింది. ఈ ఘటనలో గృహోపకరణాలు, బట్టలు పూర్తిగా కాలిపోయాయి. బాధితుడు బాబు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు కందుకూరి రమేష్ మాదిగ డిమాండ్ చేశారు.

గర్భిణీలకు పౌష్టికాహారం అందజేత

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల కేంద్రమైన పెదకూరపాడు 75తాళ్లూరు గవర్నమెంట్ హాస్పిటల్‌లో గురువారం మాగులూరి ఫౌండేషన్ మొగులూరు భాను ప్రకాష్ ఆధ్వర్యంలో గర్భిణీలకు పెరుగన్నం, రాగి జావా, గుడ్డు పంపిణీ చేశారు. ప్రతి నెల 9వ తేదీన గవర్నమెంట్ హాస్పిటల్‌లో ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తారని మాగులూరి కృష్ణారావు తెలిపారు. మొదటిగా గైనకాలజిస్ట్ డాక్టర్ నీరజ వారికి పౌష్టిక ఆహారం అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ నాయకులు ఎల్లల చెరువు సురేష్, కుంచనపల్లి కొరటాల నాగేశ్వరరావు, హాస్పటల్ సిబ్బంది శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా ఓటర్ల జాబితా తయారు చేయాలి

విశాలాంధ్ర-దుర్గి : ఓటర్ల జాబితాలో తప్పులు తడకలు లేకుండా ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా తయారు చేయాలని మండల సహాయ ఓటర్ల నమోదు అధికారి, మండల తహాశీల్దార్ జి.రమేష్ కుమార్ బిఎల్ఓలను ఆదేశించారు. కార్యాలయంలో గురువారం బిఎల్ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో ఉన్న 49 పోలింగ్ కేంద్రాల బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల సహాయ ఓటర్ల నమోదు అధికారి రమేష్ కుమార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలోని సవరణలు, తొలగింపులు, సున్నా ఇంటి నెంబర్లు, ఒకే ఇంటి నెంబర్‌పై ఎక్కువ ఓట్లు ఉన్న వాటిని సంబంధిత ఓటర్ల నుంచి ఆధారాలు తీసుకోవాలన్నారు. సున్నా డోర్ నెంబర్ గల ఓటర్లను గుర్తించి వారి నుంచి ఆధారాలు తీసుకుని సున్నాలు స్థానంలో ఆధారాలు నమోదు చేయాలని, 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు నుంచి ఆధారాలతో ధరఖాస్తులు పెట్టించాలని చెప్పారు. జనాభా ప్రాతిపదికన వెయ్యి మందికి 715 మంది ఓటర్లు ప్రతి పోలింగ్ కేంద్రాల్లో ఉండేలా చూసుకోవాలని, పూర్తి స్థాయిలో బీఎల్వోలకు ఆయన సూచించారు. 05, జనవరి 2024 వచ్చే పారదర్శకమైన ఓటర్ల జాబితాకు అందరూ పని చేసి మండలానికి మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎల్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-పెదకూరపాడు : ఈ నెల 14 నుంచి 20 వరకు పెదకూరపాడు శాఖ గ్రంథాలయం 56వ జాతీయ వారోత్సవాలు జరుగుతాయని లైబ్రరీన్ వాణి తెలిపారు. విద్యార్థులకు పుస్తక ప్రదర్శన, వ్యాసరచన వకృత్వ పోటీలు, చిత్రలేఖనం, దిశా చట్టంపై అవగాహన మహిళా దినోత్సవం నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఈ పోటీల్లో పాఠశాల విద్యార్థులు పాల్గొనాలని కోరారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామని వాణి అన్నారు.

పిడుగు పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-నూజెండ్ల: పిడుగు పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పువ్వాడ గ్రామంలో బుధవారం సాయంత్రం 6గంటల సమయంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పరిమి చిన్నబ్బాయి (29) గేదెలు కాచుకుంటుండగా పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. గెదెలకుకి వెళ్లిన చిన్నబ్బాయి చీకటిపడినా ఇంకా రాకపోవడంతో పొలానికి వెళ్లి వెతకగా గురువారం ఉదయం పొలాల్లో పడి ఉండటాన్ని గుర్తించి కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు. చిన్నబ్బాయికి, 2సంవత్సరాల కుమార్తె, ప్రస్తుతం భార్య నిండు గర్భవతిగా ఉన్నట్టు గ్రామస్తులు తెలిపారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.

పురుగులు పట్టిన కందిపప్పు..అంగన్‌వాడీ కేంద్రాలకు పోషకాహారమా?

విశాలాంధ్ర-రాజుపాలెం : మండలంలోని మొక్కపాడు గ్రామంలోని అంగన్వాడి కేంద్రాలకు పంపిణీ చేసిన కందిపప్పు పురుగులు పట్టి అధ్వానంగా ఉండడంతో రాజుపాలెంలోని పౌర సరఫరాల శాఖ గిడ్డంగి తీసుకొచ్చిన అంగనవాడి సిబ్బంది. మధ్యాహ్నం 12 గంటలైనా గిడ్డంగికి తాళాలు తీయకపోయే సరికి సమీపంలోని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో పుచ్చిపోయిన కందిపప్పు దాచి ఉంచారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా అంగన్వాడి కేంద్రాలకు వైఎస్సార్ పోషకాహార పథకం ద్వారా కందిపప్పు పంపిణీ చేస్తుంటే పౌరసరఫలాలు శాఖ నిర్లక్ష్యం ఫలితంగా పుచ్చిపోయిన, పురుగులు పట్టిన కందిపప్పు పంపిణీ చేసేసరికి అది చూసిన అంగనవాడి కార్యకర్తలు తిరిగి వెంటనే పౌరసరఫరాల శాఖ గిడ్డంగికి తీసుకువచ్చారు. బుధవారం ఒక అంగన్వాడీ కార్యకర్తకు రేషన్ షాపులో ఆయిల్ పంపిణీ చేసే సమయంలో కారిపోయిన ఆయిల్ ప్యాక్‌ను 500 గ్రాములు ఉండాల్సిన దాంట్లో 50 గ్రాములు ఆయిల్ ఉన్న ప్యాక్‌ను అందించి మాకు వచ్చినది అదేనని రేషన్ డీలర్ చెప్పారు. ఇష్టమైతే తీసుకోండి లేకపోతే మాకు సంబంధం లేదు అని అంగనవాడి కార్యకర్తలను దబాయించారు. పౌరసరఫరాల శాఖ నిర్లక్ష్యం ఫలితంగా పుచ్చిపోయిన కందిపప్పు, కారిపోయిన ఆయిల్‌ను అంగన్వాడీలకు పంపిణీ చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని అంగన్వాడి కేంద్రాలకు పంపిణీ చేసే ఆహార పదార్థాల విషయంలో నాణ్యత పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని, పురుగులు పట్టిన కందిపప్పు అంగన్ వాడీ కేంద్రాలకు పోషకాహారాన్ని తీసుకువచ్చిన అంగన్వాడీ కార్యకర్తల నుంచి పౌర సరఫరాల గౌడౌన్‌ను తదితర అధికారులు సాయంత్రం సుమారు 4 గంటల సమయానికి తెరిపించి పురుగు పట్టిన దాల్ (కంది పప్పు)ను యిచ్చి, దగ్గర ఉండి మంచి దాల్‌ను శిశు సంక్షేమ శాఖ అధికారులు అంగన్ వాడీ కేంద్రానికి పంపారు.

సమైక్య ఉద్యమాల అవసరం ఆసన్నమైంది

విశాలాంధ్ర-అమరావతి : మహిళా సాధికారత హక్కుల పరిరక్షణ కోసం,, మహిళలు అనునిత్యం ఎదుర్కొనే సమస్యల పరిష్కార మార్గం వైపు తీసుకెళ్లేందుకు సమైక ఉద్యమాలకు నాంది పలకాల్సిన అవసరం ఆసన్నమైందని పెదకూరపాడు నియోజకవర్గ మహిళా సమైక్య అధ్యక్ష, కార్యదర్శులు నడకుదురు రమణమ్మ, ఇర్ల వెంకట లక్ష్మిలు అన్నారు. గురువారం అమరావతిలో సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మంచినీటికి కటకటలాడుతున్నా మద్యం మాత్రం వేరులే పారుతుందని, మద్యాన్ని నిషేదించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. దీనికి వ్యతిరేకంగా మహిళాలోకం ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదేవిధంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు కాయితాలకు పరిమితం కాకుండా సక్రమంగా అమలు జరిపేందుకు నాటి పాలకులు సమయస్ఫూర్తిగా వ్యవహరించాలని కోరారు. ఈ నెల నంద్యాలలో 17, 18, 19 తేదీలలో జరిగే రాష్ట్ర మహాసభలకు పెద్ద సంఖ్యలో మహిళలు హాజరు కావాలని కోరారు. అనంతరం నియోజకవర్గం ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య అధ్యక్షురాలుగా నడకుదురు వెంకట రమణమ్మ , ఉపాధ్యక్షులుగా మల్ల మరియమ్మ, కార్యదర్శిగా ఇర్ల వెంకటలక్ష్మి, సహాయ కార్యదర్శిగా మేడా మల్లేశ్వరి, కోశాధికారిగా తోట జానకి, కమిటీ సభ్యులుగా ఓర అంజమ్మ, నెప్పల్లి శిరీష, తోట మేరీ, మంగళగిరి పార్వతి, కె.కృష్ణవేణి, పూర్ణతో పాటు 13 మందితో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు తెలిపారు.

నూతన కమిటీకి అభినందన

విశాలాంధ్ర-వినుకొండ: చైతన్య ప్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ స్థాపించి 2 దశాబ్దాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో నూతన కమిటీ పరిచయ కార్యక్రమాన్ని గురువారం పట్టణ సీఐ మరియు మున్సిపల్ కమిషనర్ కార్యాల యాల్లో నిర్వహించారు. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు పట్టణ సీఐ మున్సిపల్ కమిషనర్లకు పూల బొకేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యాలయాల్లో గుమ్మడి వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు గుమ్మడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వినుకొండలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని అలాగే డ్రైనేజీలు పూడిపోయి మురుగు నీరు వెళ్లే మార్గం లేక దోమల విపరీతంగా పెరిగాయని వాటి ద్వారా మలేరియా టైఫాయిడ్ జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేశారు. అదేవిధంగా సీతయ్య నగర్ కాలువ కట్ట లైను సిమెంట్ రోడ్డు ప్రక్కన డ్రైనేజీ అనేది ఇంతవరకు కట్టలేదని తద్వారా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వినతి పత్రం అందజేశారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో పట్టణ సీఐ చేపడుతున్న ప్రజాహిత, ప్రమాద నివారణ కార్యక్రమాల గురించి కమిటీ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పి.వెంకయ్య, పట్టణ సీఐ బి.సాంబశివరావు మాట్లాడుతూ చైతన్య ప్రవంతి స్వచ్ఛంద సంస్థ తెలిపిన సమస్యలపై స్పందిస్తామని 20 సంవత్సరాలుగా సేవా సంస్థ నడపడం, వృద్ధాశ్రమం నిర్వహించడం సామాన్యమైన విషయం కాదని చైతన్య ప్రవంతి, గుమ్మడి వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు గుమ్మడి వెంకటేశ్వర్లును అభినందించారు. ఈ కార్యక్రమంలో చైతన్య ప్రవంతి గౌరవ సలహాదారులు ప్రముఖ న్యాయవాది పి.సైదారావు, సంస్థ అధ్యక్షులు లాయర్ సిద్దయ్య, యువజన విభాగం సభ్యులు సద్దాం, గోరంట్ల లింగయ్య, బండి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఫైర్‌వర్క్స్ గోడౌన్‌లో తనిఖీలు

విశాలాంధ్ర-వినుకొండ రూరల్ : మండలం బ్రాహ్మణపల్లి సమిపంలో ఉన్న వినాయక క్రాకర్స్ గోడౌన్‌ను సీఐ సాంబశివరావు సిబ్బందితో కలసి పరిశీలించారు. వ్యాపారానికి సంబంధించిన అనుమతి పత్రాలను, ఫైర్ లైసెన్సు, నిల్వ సామర్థ్యంను పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలను పని చేస్తున్నాయో లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకుని వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఐ సాంబశివరావు మీడియాతో మాట్లాడుతూ క్రాకర్స్ అమ్ము కోవలనుకునే వారికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాత్కాలిక లైసెన్సులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వ్యాపారులందరూ జూనియర్ కళాశాల మైదానంలో అమ్ముకునే విధంగా అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కొందరు వ్యాపారులు స్టాండర్డ్ కాని దీపావళి మందులను అధిక ధరలకు అమ్ముతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. వ్యాపారులందరూ ప్రభుత్వ నియమ నిబంధనలతో ఏవరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా వ్యాపారం నిర్వహించుకోవాలని కోరారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

విశాలాంధ్ర-రొంపిచర్ల: వెనుక బడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని నరసరావుపేట డిప్యూటీ డిఇఓ కె.వేణుగోపాలరావు అన్నారు. మండలంలో వి.రెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం డిప్యూటీ డిఇఓ కె.వేణుగోపాలరావు వార్షిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పనితీరును పరిశీలించి తగు సూచనలు చేశారు. అదే విధంగా పాఠశాలలో రికార్డులను, అమ్మఒడి పథకము అమలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరును, ఎఫ్ఎ-1, 2 ల పేపర్ల వాల్యూయేషన్, డిజిటల్ క్లాస్ రూమ్, స్మార్ట్ టివి, లైబ్రరీ, సైన్సు పరిశోధనాశాలలును క్షుణ్ణంగా పరిశీలించి బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ సమయపాలన పాటించి విద్యార్థులకు మంచి విద్యాబోధన అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్తీక మాస అభిషేకాలు

విశాలాంధ్ర-సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు రోడ్ లో బ్రహ్మశ్రీ చింతాడ స్వప్రకాష్ గురుజీ నిర్మించిన శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమంలో కార్తీక మాసం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ వంశ పారంపర్యం ధర్మకర్త మఠాధిపతులు లలితాంబ మాతాజీ తెలిపారు. గురువారం కార్తీక మాస ఉత్సవాల గురించి ఆమె తెలిపారు. ఆశ్రమంలో ప్రతిష్టించిన బాలా త్రిపుర సుందరి అమ్మవారి సహిత మల్లిఖార్జున స్వామికి, పాదరస శివలింగంనకు, భూగర్భంలో వెలిసిన ద్వాదశ జ్యోతిర్లింగాలకు ప్రతినిత్యం నమక, చమక మహాన్యాస రుద్రాభిషేకాలు జరుపనున్నట్లు తెలిపారు. ప్రతి ఆదివారం సత్యన్నారాయణ కేదారేశ్వర వ్రతము, ప్రతి బుధవారం లక్ష్మీ గణపతి హోమం, ప్రతి సోమవారం రుద్ర హోమాలు జరుగుతాయన్నారు. నవంబర్ 26న కార్తీక పౌర్ణమి సందర్భంగా లక్ష దీపారాధన, జ్వాలా తోరణం, భజన సంకీర్తన కార్యక్రమాల జరుగుతాయన్నారు. అభిషేకాలు జరిపించుకొనదలచినవారు తమ గోత్ర నామాలను ఆశ్రమం వద్ద నమోదు చేసుకోవలసి నదిగా ఆమె తెలిపారు. కార్తీక మాసం అభిషేకాలు నవంబర్ 13 నుండి డిసెంబర్ 12 వరకు నిర్వహించనున్నారు. పూర్తి వివరాలను 9491300312 నంబర్‌లో సంప్రదించవచ్చునన్నారు.

నేటి విద్యార్థులే భావి రచయితలు

విశాలాంధ్ర-పెదకూరపాడు: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంద్వారానే భావితరం రచయితలు రూపుదిద్దుకుంటారని పెద్దకూరపాడు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వి. రమణ అన్నారు. గురువారం ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో పెద్దకూరపాడు మండల స్థాయిలో పాఠశాల, కళశాల విద్యార్థులకు కథ చెప్పండి, కథ రాయండి పోటీలు జరిగాయి. జెడ్‌పిహెచ్ పాఠశాలలో పోటీలను రమణ ప్రారంభించారు. వివిధ పాఠశాలల నుంచి 60 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి అతిథులుగా రిటైర్డ్ ఉపాధ్యాయులు పేరేచర్ల కోటేశ్వరరవు పాల్గొన్నారు. అరసం కార్యదర్శి కె.శరత్ మాట్లాడుతూ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు అభినందనలు, సహకరించిన విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, నిర్వాహకులకు ధన్యవాదలు తెలిపారు. దాసరి వినోద్ కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు.

కృష్ణవేణిలో జాతీయ న్యాయ సేవా దినోత్సవం

విశాలాంధ్ర-మాచర్ల: చట్టం, న్యాయవ్యవస్థల పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సీనియర్ న్యాయవాదులు కేళం శ్రీనివాసరావు, షేక్ గౌస్ బాషా అన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవంను పురస్కరించుకొని పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు హక్కుల పట్ల అవగాహన కల్పించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయ సేవాధికార చట్టంను ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. వార్షికాదాయం మూడు లక్షల లోపు ఉన్నవారికి న్యాయవ్యవస్థ అందించే ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, వాహనాలను నడిపేటప్పుడు తగిన సూచనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మెట్టు గోవిందరెడ్డి, న్యాయవాదులు గంగుల శ్రీనివాసరావు, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

14న మెగా అప్రెంటిస్ మేళ

విశాలాంధ్ర-మాచర్ల: ఈనెల 14న స్థానిక ఆర్. ఐ.టి.ఐ కళాశాలలో మెగా అప్రెంటీస్ మేళా జరగనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్.ఎస్.వి ప్రసాద్ బాబు తెలిపారు. గురువారం ప్రసాద్ బాబు మాట్లాడుతూ గతంలో ఒక సంవత్సరం, లేదా రెండు సంవత్సరాల పాటు వివిధ ట్రేడ్ లలో శిక్షణ పొందిన విద్యార్థులు ఈ అప్రెంటిస్ మేళాకు హాజరు కాగలరని, ఉదయం 10 గంటలకు జరగనుందని, మేళాకు వివిధ కంపెనీల నుండి ప్రతినిధులు రానున్నారన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రసాభాసాగా పరాశక్తి సమావేశం

విశాలాంధ్ర-రెంటచింతల: మండలంలోని జెట్టిపాలెం పరాశక్తి సిమెంట్ కర్మాగారం విస్తరణ పనుల కోసం గురువారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సమావేశం రసాభాసాగా ముగిసింది. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దత్తత గ్రామమైన జెట్టిపాలెంలో కనీస వసతులు కల్పించటంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచినీటి సౌకర్యం కల్పించలేదని, భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేదని, సిమెంట్ పరిశ్రమ నుండి వెలువడే దుమ్ము ధూళి వల్ల పంట నష్టం జరుగుతున్న తగు చర్యలు తీసుకోవటంలేదని ఆరోపిస్తూ సమావేశంలో గందరగోళం సృష్టించారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ ఈ నెల 22న మరోసారి సమావేశం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామీణుల సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సమావేశంలో పరాశక్తి మేనేజరు ధర్మారెడ్డి పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాణాసంచా విక్రయాలకు అనుమతులు కావాలి

విశాలాంధ్ర-రాజుపాలెం : రాజుపాలెం మండల ప్రజలకు పోలీసువారి విజ్ఞప్తి శ్రీ పల్నాడు జిల్లా ఎస్పీ సత్తెనపల్లి డీఎస్పీ వారి ఉత్తర్వులు మేరకు దీపావళి పండుగ సందర్భంగా రాజుపాలెం మండల పరిధిలో టపాకాయలు అమ్ముకొనే వారికి పోలీస్ వారి అనుమతి తప్పనిసరి. అనుమతులు లేకుండా టపాకాయలు అమ్మడం చట్టరీత్యా నేరం. అనుమతులు లేకుండా టపాకాయలు అమ్మిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకొనబడును. టపాకాయల అమ్ముvారు సంబంధిత అన్ని శాఖల నుండి అనుమతులు తప్పనిసరి. ఎవరైనా అనుమతులు లేకుండా టపాకాయలు అమ్మిన యెడల సదరు సమాచారం రాజుపాలెం పోలీసు వారికి తెలియజేయాలి. ప్రజలందరూ ప్రశాంతమైన వాతావరణంలో తగు జాగ్రత్తలతో దీపావలి పండుగ జరుపుకోవాలని రాజుపాలెం పోలీస్ శాఖ వారు తెలియజేశారు.

దేవస్థానం హుండీ ఆదాయం లెక్కింపు

విశాలాంధ్ర-అమరావతి : శ్రీ అమరేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రధాన హుండీల ద్వారా గురువారం లెకించగా భక్తుల నుంచి వచ్చిన విరాళాలు రూ.10,29,938లు,అన్నదానం హుండీల ద్వారా రు.87,559లు 41 రోజులకు గాను ఆదాయం వచ్చింది. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం ఈఓ వేమూరి గోపి ఆధ్వర్యంలో పెదకూరపాడు గ్రూప్ దేవస్థానముల ఈఓ ఈ.సత్యనారాయణ రెడ్డి, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కౌశిక్ కుమార్ శర్మ, సిబ్బంది, భ్రమరాంబా సేవా సమితి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-ఈపూరు: క్రీడాకారులు ఆత్మస్థైర్యం, పట్టుదలతో ప్రతి ఒక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధిం చాలని ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చుండు వెంకట్రావు అన్నారు. మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం యం.పి.ఈ.డీ విద్యను అభ్యసిస్తున్న జి.సాల్మన్రాజు, ద్వితీయ సంవత్సరం బి.పి.ఈ.డీ విద్యను అభ్యసిస్తున్న కూచి భాను ప్రకాష్, ప్రథమ సంవత్సరం బి.పి.ఈ.డీ విద్యను అభ్యసిస్తున్న పాదిలి సురేష్, ద్వితీయ సంవత్సరం బి.పి.ఈ.డీ విద్యను అభ్యసిస్తున్న షేక్ చాందిని, ప్రథమ సంవత్సరం ఎం.పీ.ఈ.డి విద్యను అభ్యసిస్తున్న జి.నందిని, వి.వెంకట లక్ష్మీ, ప్రథమ సంవత్సరం బిపిఈడి విద్యనభ్యసి స్తున్న తిరుపతమ్మ, కె.అమల విద్యార్థిని, విద్యార్థులు నాగార్జున విశ్వ విద్యాలయాల పురుషులు, మహిళల జట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ధనలక్ష్మీ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకట్రావు గురువారం తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గెలుపోటమలు క్రీడాకారుల జీవితాల్లో కొలమానం కారాదన్నారు. ఆరోగ్యం, విజ్ఞానం, క్రమశిక్షణకు క్రీడలు ఎంతగానో దోహదపడతా యని, ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడలపైనా ఆసక్తి పెంచుకోవాల న్నారు. త్రివేంద్రంలోని కేరళ యూనివర్సిటీ నందు జరిగే బాస్కెట్బాల్ పోటీలు పురుషుల జట్టుకు, బెంగళూరులోని బెంగుళూరు యూనివ ర్సిటీ నందు జరిగే పోటీలు మహిళల జట్టుకు జరుగుతాయన్నారు. అనంతరం ఎంపికైన క్రీడాకారులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మేదరమెట్ల రామ శేషగిరిరావు అధ్యాపకులు ఎం బలరాం నాయక్, ఎం సురేష్, ఎం దాసు తదితరులు అభినందించారు.

15న సీఎం జగన్ మాచర్ల రాక



విశాలాంధ్ర-మాచర్ల: నాలుగు దశాబ్దాల నాటి పల్నాటి వాసుల కలను సాకారం చేసేందుకు ఈనెల 15న వరికపూడిశెల ప్రాజెక్టు శంకుస్థాపనకు సీఎం జగన్ మోహన్ రెడ్డి మాచర్లకు రానున్నట్లు వైఎస్ ఆర్సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి తెలిపారు. గురువారం వెంకటరామిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణంతో పల్నాడు ప్రాంతంలోని వినుకొండ, మాచర్ల, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల్లోని లక్షలాది ఎకరాలు సస్యశ్యామలం కానుందన్నారు. నాటి సీఎం చంద్రబాబు అసెంబ్లీ సాక్షిగా వరికపూడిశెల నిర్మాణం సాధ్యం కాదని చేతులెత్తేసిన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. వెనుకబడిన పల్నాడు రైతాంగాన్ని ఆదుకునేందుకు సీఎం జగన్ ఇచ్చిన మాటకు కట్టుబడి చిత్తశుద్ధితో ఉన్నారన్నారు. ఇప్పటికే ప్రాజెక్టు నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చాయని, త్వరలో పనులు ప్రారంభం కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు రైతులను కేవలం ఓటు బ్యాంకు గానే చూస్తూ మాయమాటలతో కాలం గడిపాడని, చంద్రబాబు అసత్య ప్రచారాన్ని ఎవరూ నమ్మటం లేదన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి తాము చేసిన అభివృద్ధికి ప్రజలు నాలుగు సార్లు గెలిపించారన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 15న పట్టణంలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభకు ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వీఆర్‌వోపై ప్రజా సంఘాల నేతల ఫిర్యాదు

విశాలాంధ్ర-వినుకొండ రూరల్: ప్రభుత్వ, పట్టాదారు భూముల రికార్డులను తాలుమాలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నాడని ఆరోపణలతో వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి విఆర్ఓ నాగరాజు పై ప్రజాసంఘాల నేతలు ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. నాగరాజు బ్రాహ్మణపల్లి గ్రామంలో ఆక్రమణ దారులకు మద్దతుగా ఉంటూ రికార్డులను తారుమారు చేయడం ద్వారా ప్రజల్ని మోసం చేస్తున్నాడని ఈ సర్వే జరుగుతున్న నేపథ్యంలో ఒకరి భూములు మరొకరి పేర్లతో రికార్డుల్లో ఎక్కిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నాడని అలాగే సర్వేనెంబర్ 68, 86బి చెరువు పోరంబోకు భూమిలో నాగరాజు బంధువులకు అక్రమంగా గృహ నిర్మాణ చేపట్టేందుకు సహకరించారన్నారు. స్థానిక అధికారులు కూడా ఇతనిపై చర్యలు తీసుకోకపోవడంతో గత్యంతరం లేక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆర్డీవోని కలిసి అతనిపై ఫిర్యాదు చేయడం జరిగిందని వారు అన్నారు. అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని, పట్టా భూముల యజమానులకు రక్షణ కల్పించాలని, ప్రభుత్వ భూములను కాపాడాలని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎం పల్నాడు జిల్లా అధ్యక్షులు మస్తాన్ వలి, జై భీమ్ భారత్ పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గోదా జాన్ పాల్, భారత బచావో పల్నాడు జిల్లా అధ్యక్షులు వి.కోట నాయక్ పాల్గొన్నారు.

జగన్ భజనకే వైసీపీ బస్సుయాత్ర

విశాలాంధ్ర-వినుకొండ: నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం జనసేన పార్టీ అధికార ప్రతినిధి పారెళ్ళ అభిమన్యు మాట్లాడుతూ వైసీపీ బస్సు యాత్ర కాదు జగనన్న భజన యాత్రగా ఉందంటూ ప్రజలు అనుకుంటున్నారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌ని ఎంతో అభివృద్ధి చేశామటున్నారు ! అభివృద్ధి ఏది! ఎక్కడో మాకు కనిపించడం లేదన్నారు. నా ఎస్సీలు, నా బీసీలు, నా ఎస్టీలు అన్నారు వాళ్లకి ఏం న్యాయం చేశారు ప్రజలకు తెలియజేయాలన్నారు. నేటికీ తాగు, సాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్న గ్రామాలు చాలా ఉన్నాయి. ఆ గ్రామాలలో ప్రజలు రోజురోజుకి వలస వెళ్లిపోతున్నారు. ఇలానే కొనసాగితే రాబోయే కాలంలో గ్రామాలు గ్రామాలు వలస వెళ్లిపోతాయని, పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు, కరెంటు బిల్లులు, ఆర్టీసీ బస్సు చార్జీలతో తల్లడిల్లిపోతున్నారని అన్నారు. రాబోయే కాలంలో పవన్ కళ్యాణ్ వ్యూహాలతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధిస్తాం... ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటారని పేర్కొన్నారు.

నెల రోజుల్లో బైపాస్ పూర్తి చేస్తామని హామీ

విశాలాంధ్ర-పిడుగురాళ్ల : నెల రోజుల్లో పిడుగురాళ్ల బైపాస్ పూర్తి చేస్తామని జనసేన నాయకులకు క్యూబ్ సంస్థ ప్రతినిధులు హామీ ఇవ్వడం జరిగింది. పిడుగురాళ్ల బైపాస్‌పై సరైన స్పష్టత లేనందున తుమ్మలచెరువు టోల్ ప్లాజా వద్ద నిరసన తెలియజేయటానికి వెళ్తున్న జనసేన నేతలను పోలీస్‌లు అరెస్ట్ చేసి స్టేషన్‌కి తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసన తెలియజేసే హక్కు కూడా లేదా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఆరు నెలల్లోనే పిడుగురాళ్ల బైపాస్ పూర్తి చేస్తారని మాయమాటలు చెప్పి, ఈ ప్రాంత ప్రజల ఓట్ల ద్వారా గెలిచి, అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు దాటిన ఇంతవరకు పిడుగురాళ్ల బైపాస్ పూర్తి చేయకపోవడంతో తాము శాంతియుతంగా నిరసన తెలియజేద్దామని తుమ్మలచెరువు వెళ్తున్న క్రమంలో అడ్డుకోవడం ఎంటని ప్రశ్నించారు. అన్నతరం పిడుగురాళ్ల సీఐ ఆంజనేయులు క్యూబ్ సంస్థ అధికారులను పిలిపించి, మాట్లాడించారని జనసేన నేతలు తెలిపారు. నెలరోజులో బైపాస్ పూర్తి చేస్తామని క్యూబ్ సంస్థ అధికారులు జనసేన నేతలకు హామీ ఇవ్వడం జరిగిందన్నారు. నిరసన తెలియచేసిన వారిలో జిల్లా కార్యదర్శి కటికం అంకారావు, జిల్లా సంయుక్త కార్యదర్శిదూదేకుల ఖాసీం సైదా, జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు దూదేకుల సలీం, పసుమర్తి మణి, జానపాడు గ్రామ అధ్యక్షులు పసుపులేటి నరసింహారావు, పిడుగురాళ్ల మండల కార్యదర్శి కంభంపాటి ముక్కంటి, దీకొండ కిరణ్, వర్ల జెస్సి తదితరులు ఉన్నారు.

రైతులు సుభిక్షంగా ఉండాలంటే చంద్రబాబు సీఎం కావాలి



విశాలాంధ్ర-నూజెండ్ల : వినుకొండ నియోజకవర్గం నూజెండ్ల మండలం రవ్వారం గ్రామంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ చంద్రబాబు పరిశ్రమలు రప్పించి,పెట్టుబడులు పెట్టించి ఆదాయం సృష్టించారన్నారు. ఆస్తులు పెంచారని, యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందినట్లు చెప్పారు. రైతులు సుభిక్షంగా ఉండాలంటే చంద్రబాబులాంటి విజనరీ నాయకుడు అధికారంలోకి రావాలన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం, ఏడాదికి ఉచితంగా నాలుగు గ్యాస్ సిలిండర్లు, అన్నదాత పథకంతో రైతుకు ఏటా రూ.20వేల ఆర్థిక సాయం, యువగళంతో యువతకు రూ.3వేలు నిరుద్యోగ భృతి, బీసీలకు రక్షణ చట్టం, ఇంటింటికి కుళాయి అమలవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ బచ్చు అంజిరెడ్డి, మండల పార్టీ అధయక్షులు మీసాల మురళీకృష్ణ యాదవ్, మరిడి సురేష్, బత్తుల సుబ్బారావు, ఓబులాపురం వెంకట నాగయ్య, ఓబులాపురం వెంకట కోటయ్య, గౌరబోయిన శివయ్య, రావులపల్లె గాలెయ్య, ఓబులాపురం బాల నాయుడు, పారెళ్ళ వీరాంజనేయులు, పారెళ్ల దాశయ్య, కొమిరిసెట్టీ శ్రీను, ముంద్రు సుబ్బారావు, వంకాయలపాటి పేరయ్య, సోమేపల్లి బ్రహ్మయ్య, రోడ్డ వీరాంజనేయరెడ్డి, రావుల మల్లేశ్వరరావు, పాలిపోగు బాల గురవయ్య, కంచుమాటి నరేష్, మట్టి బులెయ్య, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చీరాలలో మహిళా సమైఖ్య జిల్లా సమావేశం

సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ

విశాలాంధ్ర - బాపట్ల : ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా సమావేశం చీరాల జండ్రపేటలోని అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ తెలిపారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య రాష్ట్ర అధ్యక్షురాలు వి.జయలక్ష్మి, రాష్ట్ర నాయకులు మర్రి విజయ పలువురు రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. జిల్లా, నియోజకవర్గ,మండల పార్టీ నాయకులు కార్యక్రమం విజయవంతం చేయాలని సింగరకొండ కోరారు.

నేడు ఇంచార్జ్ మంత్రి కొట్టు పర్చూరు రాక

విశాలాంధ్ర - బాపట్ల : పర్చూరు నియోజకవర్గస్థాయి సమీక్షా సమావేశం పర్చూరు మండలం మార్కెట్ యార్డ్ ఆవరణలో శుక్రవారం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించే సమావేశానికి ముఖ్య అతిథిగా బాపట్ల జిల్లా ఇన్చార్జి మంత్రి, దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ హాజరవుతారన్నారు. జిల్లా అధికారులు సమగ్ర సమాచారంతో, సకాలంలో సమావేశానికి హాజరు కావాలని ఆయన తెలిపారు.

ఎమ్మెల్యే రవికుమార్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-అద్దంకి ; అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ జన్మదిన వేడుకలను గురువారం తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పోతురాజుగండి వద్ద గల తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జన్మదిన కేక్‌ను పట్టణ తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు చిన్ని శ్రీనివాసరావు కట్‌చేసి పార్టీ నాయకులకు, అభిమానులకు పంచిపెట్టారు. గొట్టిపాటి రవికుమార్‌కు పార్టీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అద్దంకి మున్సిపాలిటీకి చెందిన తెదేపా కౌన్సిలర్‌లు,క్లస్టర్ ఇన్‌చార్జిలు, మండల తెలుగుదేశంపార్టీ నాయకులు,ఎమ్మెల్యే రవికుమార్ అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు

కొల్లూరు : మహబూబ్ సుబాని గ్యార్మి పండుగ వేడుకలు కొల్లూరులో అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గురువారం స్థానిక జెండా చెట్టు వద్ద నుంచి విద్యుత్తు దీపాలతో అత్యంత ఆకర్షణీయంగా అలంకరించిన జెండాను ఊరేగింపుగా తరలించారు. కొల్లూరు పురవీదులలో నిర్వహించిన ఊరేగింపుకు విశేష స్పందన లభించింది. జెండా పండుగ వేడుకలలో మత సామరస్యానికి నిదర్శనంగా ముస్లింలు, హిందువులు ఊరేగింపులో పాల్గొనడంతోపాటు, జెండా వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపు అనంతరం జెండాను స్థానిక జెండా చెట్టు వద్ద ప్రతిష్టించారు. కార్యక్రమంలో కొల్లూరు మాజీ ఎంపీపీ కనగాల మధుసూదన్‌ప్రసాద్, సంఘండైరి డైరెక్టర్ గుత్తికొండ లక్ష్మీజ్ఞానానంద భగవాన్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు అభినందనలు

విశాలాంధ్ర - చీరాల : చీరాలలో సుదీర్ఘ కాలం పాటు పనిచేసిన కమిషనర్ రామచంద్రారెడ్డి ఉన్నత స్థానానికి ఎదగడం ఆనందమని,నిజాయితీ గల అధికారిగా రానున్న రోజుల్లో మరిన్ని హొదాల్లో పనిచేసి మంచి పేరు పొందాలని దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ జిలాని అన్నారు.స్పెషల్ గ్రేడ్ కమిషనర్ గా పదోన్నతి పొందిన చీరాల మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డిని గురువారం దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ జిలాని ఆయన కార్యాలయంలో కలసి అభినందనలు తెలిపారు.

వాగు ఉధృతి.. రాకపోకలు అంతరాయం

విశాలాంధ్ర - యద్దనపూడి : గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వల్ల పర్చూరు వాగు పోలూరు వద్ద వంతెన మీదగా ప్రవహించటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. నిత్యం పోలూరు గ్రామం నుంచి మండల కేంద్రమైన యద్దనపూడికి అధికారులు ఈ వంతెన మీదగానే రాకపోకలు సాగిస్తారు. చిలకలూరిపేట నుంచి పోలూరు ఆర్టీసీ బస్సు ఈ వంతెన మీదగానే రావాలి. గ్రామంలోని విద్యార్థులు పర్చూరు, మార్టూరు పాఠశాలలకు వెళుతుంటారు. వాగు ఉధృతిగా ప్రవహించటంతో గ్రామంలోని ప్రజలు ప్రయాణాలు సాగించలేకపోయారు. గత ప్రభుత్వాయాంలో బ్రిడ్జి నిర్మించడానికి ప్రతిపాదన పంపినప్పటికీ నేటికీ కార్యరూపం దాల్చక పోవటంతో ప్రజలు సంబంధిత అధికారులు, నాయకులు, గ్రామ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : ప్రజా రవాణా వ్యవస్థలోని ఆర్టీసీ ప్రయాణీకుల సమస్యలపై డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చీరాల డిపో మేనేజర్ శ్యామల తెలిపారు. ప్రయాణికులకు ఉన్న సమస్యలపై నిర్వహించే కార్యక్రమంలో సమస్యలను తమ దృష్టికి తీసుకుని వస్తే వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఆర్టీసీ వలన ఏదైనా ఇబ్బందులు తలెత్తినా తెలపాలన్నారు. ఆర్టీసీ సేవలను మెరుగు పరిచే సలహాలను, సూచనలను అందించవచ్చునన్నారు. 10వ తేదీ శుక్రవారం ఉదయం గం.10.30ల నుండి 11.30 వరకు 9959225696 ను డయల్ చేసి తమను సంప్రదించాలన్నారు.

విజ్ఞాన పరిజ్ఞానాన్ని పెంపొందించాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : విద్యార్థుల్లో విజ్ఞాన పరిజ్ఞానాన్ని పెంపొందించవలసిన అవసరం ఉందని ఎంఈఓ సిహెచ్ గోపి అన్నారు. యద్దనపూడి ప్రాథమిక పాఠశాలను ఆయన కస్మికంగా సందర్శించారు.పాఠశాలలో తెలుగు, ఆంగ్లం, గణిత సబ్జెక్టులలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల నోట్‌బుక్స్ , వర్క్ బుక్స్ పరిశీలించారు. విద్యార్థుల విషయ పరిజ్ఞానాన్ని పరిశీలించి పాఠశాల నిర్వహణపై, విద్యార్థుల ప్రగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్నం భోజనం పరిశీలించారు.అన్ని పాఠశాలల వారు మధ్యాహ్న భోజనంలో చిక్కిలు, రాగిపిండి తయారీ తేదీలను పరిశీలించి ఉపయోగించాలన్నారు. టాబ్‌లు, స్మార్ట్ టీవీలు ఉన్న పాఠశాలల వారు ప్రతి రోజూ ఉపయోగించాలన్నారు. నాడు - నేడు పనులు పారదర్శకంగా నిర్వహిస్తూ వేగంగా పూర్తి చేయాలన్నారు. అన్ని పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు కల విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రావి శ్రీనివాసరావు , ఉపాధ్యాయురాలు ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడా లేని సంక్షేమ పథకాలు ఏపీలోనే అమలు: మంత్రి

విశాలాంధ్ర - వేమూరు : దేశంలో ఏ రాష్ట్రంలో అందించని సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో మన రాష్ట్రంలో అమలవుతున్నాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మాత్యులు మెరుగు నాగార్జున అన్నారు. రాష్ట్రానికి జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా గురువారం వేమూరు పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి బి అర్జున్ రావు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి నాగార్జున మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం 26 సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. నేరుగా లబ్ధిదారుల ఖాతాలోనే నగదు రూపంలో అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని ఆయన నేతృత్వంలోనే రాష్ట్రంలో ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని నాగార్జున తెలియజేశారు. ఇటువంటి ముఖ్యమంత్రిని తిరిగి అధికారంలోకి తెచ్చుకునే విధంగా రానున్న ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఒక వేమూరు సచివాలయం -1 పరిధిలో ఇప్పటి వరకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల కోసం గత నాలుగున్నర ఏళ్లలో 33 కోట్ల పైచిలుకు నిధులు ఖర్చు చేసినట్లు మంత్రి నాగార్జున గుర్తు చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని, రాష్ట్రంలో సంక్షేమ పాలన అమలు కావాలంటే ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని తిరిగి అధికారంలోకి తీసుకురావాలని నాగార్జున అన్నారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించి గ్రామ పరిధిలో జరిగిన అభివృద్ధి సూచిక బోర్డును ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జడ్పీటీసి గాజుల హేమలత, ఎంపీపీ యల్ల మాటి మోహనరావు, గ్రామ సర్పంచ్ సజ్జ శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, తాసిల్దార్ నాగరాజారావు, ఇన్చార్జ్ ఎంపీడీవో అనురాధ, మాజీ డిసిఎంఎస్ అధ్యక్షులు గాజుల మోహన్, మాజీ ఎంపీపీలు బొలి శెట్టి ప్రభాకర్ రావు,దాసరి ముత్తయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు గాజుల భాను ప్రకాష్,దున్న మేరిస్ బాబు, చందోలు డేవిడ్ విజయ్ కుమార్, తల తోటి సువర్ణ రాజు పార్టీ నాయకులు కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ రథసారథి జగన్మోహన్ రెడ్డి

విశాలాంధ్ర - బల్లికురవ : దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సంక్షేమ రథసారధిగా నిలిచిన ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అని జిల్లా రైతు అధ్యక్షులు, సంతమాగులూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చింతల పేరయ్య అన్నారు.గురువారం మండల కేంద్రమైన బల్లికురవ సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పేరయ్య మాట్లాడుతూ రాష్ట్రానికి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ పేద బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు.దేశ చరిత్రలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు.ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక విద్య,వైద్యం,వ్యవసాయం అనేక రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు.అందుకే రాష్ట్రంలో ఉన్న ప్రజలు మరల జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారన్నారు.ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి రాబోయే ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని చూడాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల లోగోను ఆయన ప్రారంభించారు.అనంతరం గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి,జేసిఎస్ మండల కన్వీనర్ టి నరేష్,మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ శ్రీనువలి,సర్పంచులు ధూళిపాళ్ళ బుల్లిరామయ్య,పసల అంజలి నాగేశ్వరరావు,శంకర్ రెడ్డి,వివిధ శాఖల అధికారులు గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంతోనే అభివృద్ధి

విశాలాంధ్ర-అద్దంకి; సంక్షేమం కోసమే అభివృద్ధి.. సంక్షేమంతోనే అభివృద్ధి అని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించారని శాప్‌నెట్ చైర్మన్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే (వై ఏపి నీడ్స్ జగన్) కార్యక్రమాన్ని గురువారం అద్దంకి మున్సిపల్ పరిధిలోని 3వ సచివాలయం నందు కృష్ణచైతన్య ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్, జగన్ తన ప్రజాసంకల్పయాత్రలో ప్రజల నుంచి వచ్చిన ఆకాంక్షలతో మ్యానిఫెస్టో రూపొందించి అధికారం చేపట్టిన నాలుగున్నర ఏళ్ళలో పార్టీలకు అతీతంగా అవినీతికి తావులేకుండా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి సంక్షేమమే అభివృద్ధి అని నిరూపించారన్నారు. రెండేళ్ళ కోవిడ్ సంక్షోభాన్ని కూడా దాటుకొని ప్రజలకు ఇచ్చిన హామీలను 99శాతం అమలు చేసి ప్రజలకు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఒక భద్రతను, నమ్మకాన్ని జగన్ కల్పించారన్నారు.సచివాలయ కన్వీనర్లు,వాలంటీర్లు ప్రతి గడపకు వెళ్ళి చంద్రబాబు,జగన్ హామీల్లో ఎవరు ఎక్కువ పథకాలు అమలు చేశారో ప్రజలకు వివరించి రాష్ట్రానికి జగనే మరలా ఎందుకు కావాలో వివరించాలన్నారు.సచివాలయ పరిధిలో నాలుగున్నర ఏళ్ళలో చేపట్టిన సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును కృష్ణచైతన్య ఆవిష్కరించారు. అనంతరం వార్డు సచివాలయం వద్ద వైసీపీ జెండాను కృష్ణచైతన్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో అద్దంకి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎల్,ఎస్తేరమ్మ, కమీషనర్ బి,శ్రీనివాసులు,సచివాలయ ఉద్యోగులు,వార్డు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

విశాలాంధ్ర - నిజాం పట్నం : ప్రజల సంక్షేమం, అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యం అని వైసీపీ నాయ కులు మోపిదేవి హరనాథ్ బాబు, జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య అన్నారు.గురువారం మండలంలోని నిజాంపట్నం -1 సచివాలయం వద్ద నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ కి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని ముఖ్యఅతిధులుగా వారు హాజరై ప్రారంభించారు.తొలుత వైసీపీ జెండాను ఆవిష్కరించిన అనంతరం సచివాలయం పరిధిలోని సంక్షేమ పథకాల లబ్ధిదారుల సంఖ్య, ప్రతి పథకానికి పంపిణీ చేయబడిన నగదు వివరాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్యమని చెప్పారు.సంక్షేమంతోనే అభివృద్ధి అని సీఎం జగన్ నిరూపించారని చెప్పారు.కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సీఎం జగన్ పారదర్శక పాలన అందించారని చెప్పారు.మేనిఫెస్టోలోని 99.5శాతం హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసి సుపరిపాలన అందించారని కొనియాడారు.రాబోయే ఎన్నికలలో సీఎం వైఎస్ జగన్‌ను మరల ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోలేరమ్మ, ఉప సర్పంచ్ మార్కండేయులు, పంచాయతీ కార్యదర్శి అజయ్ కుమార్, మండల సచివాలయాల కన్వీనర్ నాజర్ ఖాన్, మారక శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ భార్గవి వెంకట్రావు, నిజాంపట్నం రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కె. గౌరీ శంకర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తెద్దాం..

విశాలాంధ్ర - చీరాల : కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అభిమానులు కలసి రావాలని పార్టీ ఇంచార్జి దేవరపల్లి రంగారావు అన్నారు.గురువారం పట్టణం లోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులను కలసి పార్టీలోకి తిరిగి రావాలని రంగారావు ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో దేవరపల్లి రంగారావు మాట్లాడుతూ దేశం,రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు.దేశంలో కాంగ్రెస్ అధికారం కోల్పోయక దేశాభివృద్ధి కుంటుపడిందని, కులాల పేరిట ప్రజలను విచ్ఛిన్నం చేస్తున్నారన్నారు .రాష్ట్రాభివృద్ధికి,బడుగు బలహీన వర్గాలకు అండగా ఉండే కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు సీనియర్ నాయకులు యువ నాయకులతో కలిసి రావాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు దేవరపల్లి అరవింద్,కొరద్దుల సురేష్,చీరాల పట్టణాధ్యక్షుడు బండ్లమూడి విజయ్ కుమార్, మెరుగు రమేష్,మర్రి శ్రీనివాసరావు,కాకి జయ ప్రకాష్,భాష,మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన

విశాలాంధ్ర - చీరాల రూరల్ : నియోజకవర్గ శాసన సభ్యులు కరణం బలరామ కృష్ణమూర్తి, వైకాపా ఇంచార్జి కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు మండలంలోని ఈపురుపాలెం సచివాలయం - 1 పరిధిలో రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్‌కి జగనన్న ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు సచివాలయ పరిధిలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల డిస్ప్లే బోర్డులను ఆవిష్కరించారు. మార్కెట్ సెంటర్‌లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కే నేతాజీ, వైకాపా నాయకులు మాట్లాడుతూ ఈపురుపాలెం సచివాలయం - 1 పరిధిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా మొత్తంగా రూ. 29,29, 49,776 కోట్లు లబ్ధిదారులకు నేరుగా అందించామన్నారు. ఈ కార్యక్రమంలో గవిని శ్రీనివాసరావు, అసాది అంకాల రెడ్డి, కావూరి రమణారెడ్డి, బోయిన కేశవులు, బుర్ల సాంబశివరావు, బిట్రా శ్రీనివాసరావు, ఆకురాతి పద్మిని, శీలం వెంకటేశ్వరమ్మ, పిట్టు పోలయ్య, నల్లబోతుల రాజకుమార్, బుర్ల మురళి, గుర్రం బుజ్జి బాబు,ముట్టే శేషులు, షేక్ మస్తాన్, మచ్చ సువార్త, అండగుండ నారాయణ, పర్వతనేని శ్రీనివాసరావు, చప్పిడి రామచంద్రరావు, గుంటూరు సుబ్బారావు, కోటి రవి, గుజారి సుబ్బారావు, గండి చెన్నయ్య, షేక్ కలిశా,బుదాటి సాంబశివరావు, కొమ్మనబోయిన గవాస్కర్, రామనాథం కేశవ, చొప్పరపు లోకనాథం, దేవరకొండ లీలా, వైకాపా నాయకులు, అధికారులు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లండి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు రూపొందించిన మినీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని ఇంచార్జి ఎంఎం కొండయ్య అన్నారు. ఆయన ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంపై అవగాహన సదస్సును తెదేపా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ తెదేపా అందించబోయే పథకాలను వివరిస్తూ, వైకాపా అసమర్థ విధానాలను, అరాచక పాలనను, కక్ష సాధింపు చర్యలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గుద్దంటి చంద్రమౌళి , నర్రా తిరుపతయ్య గంజి పురుషోత్తం, గుర్రం వెంకటేశ్వర్లు, నక్కల పాండు, దుడ్డు శామ్యూలు, పృథ్వీ లలిత మోహన్, గురవయ్య, నక్కల శీను, ఎస్ కే బాబు, బుర్ల చిన్న రాంబాబు, వీర్లంకా రెడ్డి, సోమయ్య,అందే ఉమామహేశ్వరరావు, గుత్తి శివయ్య, యర్ర శివనాగమల్లేశ్వరి, కర్పూరపు సుబ్బలక్ష్మి, తెదేపా నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రజక ఆత్మ గౌరవ మహాసభ

విశాలాంధ్ర - చీరాల : నాగార్జున యూనివర్సిటీలో రాజకీయ పార్టీలకు అతీతంగా నవంబరు 26న జరిగే రజక ఆత్మ గౌరవ మహాసభను విజయవంతం చేయాలని రజక ఐక్యవేదిక నాయకులు పాతపాటి అంజిబాబు అన్నారు. రజక మహాసభ ను జయప్రదం చేయాలని గురువారం చీరాల రజక కార్యాలయంలో గోడ పత్రిక ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పాతపాటి అంజిబాబు మాట్లాడుతూ ప్రతి రజకుడు ఒక్కరోజు రజక జాతి కోసం అనే నినాదంలో వేలాదిగా రజక సోదర సోదరిమణులు పాల్గొనాలన్నారు. మహాసభకు మద్దతుగా గురువారం గుంటూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ పోస్టర్ ఆవిష్కరించి రజకుల న్యాయమైన కోరికలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారని,ఈ మహాసభలో రజకులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ అన్నవారపు నాగమల్లేశ్వరవు,పై దాల సాంబశివరావు,కర్నూలు నాగరాజు,దాసరి తిరుపతిరావు,దార్లపాటి భాస్కర్,తదితరులు పాల్గొన్నారు.

వెదుళ్లపల్లిలో డాగ్‌స్క్వాడ్ భవనం ప్రారంభం

విశాలాంధ్ర - బాపట్ల : తీవ్రమైన నేరాలు జరిగినప్పుడు మిస్టరీగా మారిన కేసులలో నిందితుల ఆచూకీ కనుగొనడంలో జాగిలాలు పాత్ర కీలకంగా ఉంటుందని ఎస్పీ వకుల్‌జిందాల్ చెప్పారు. వెదుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నిరుపయోగంగా ఉన్న పోలీస్ క్వార్టర్స్ భవనాన్ని పు:న నిర్మించి పోలీస్ డాగ్ స్క్వాడ్ విభాగానికి అనుకూలంగా పోలీస్ జాగిలాలకు కెన్నెల్స్ ఏర్పాటు చేసిన భవనాన్ని ఎస్పీ గురువారం జిల్లా సిబ్బందితో కలిసి సంప్రదాయబద్ధంగా వేదమంత్రాలతో పోలీస్ డాగ్ స్క్వాడ్ భవనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మనుషులకు సాధ్యం కాని పనిని జాగిలాలు సునాయాసంగా చేస్తూ నేర పరిశోధనలో పోలీస్ శాఖకు విశేష సేవలు అందిస్తున్నాయన్నారు. హత్యలు, దోపిడీలు, దొంగతనాలు జరిగిన సమయంలో నిందితులను పట్టించడం పేలుడు పదార్థాలను గుర్తుంచడంలో జాగిలాల పాత్ర కీలకమైనదని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం టైగర్ (స్నిఫర్), ఫాక్సీ (ట్రాకర్), షాడో (ట్రాకర్), బిట్టు (స్నిఫర్), చెర్రీ (స్నిఫర్), బికో (స్నిఫర్) 6 జాగిలాలు ఉన్నాయన్నారు. జాగిలాలను సంరక్షించడానికి సరైన సదుపాయాలు లేకపోవడంతో జిల్లాలోని వెదుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నిరుపయోగంగా ఉన్న పోలీస్ క్వార్టర్స్ లోని ఒక భవనాన్ని పునర్నిర్మించి అందులో జాగిలాలకు అవసరమైన కెన్నెల్స్ నిర్మించి, జాగిలాలను సంరక్షించే సిబ్బంది ఉండడానికి కావలసిన అన్ని సౌకర్యాలను కల్పించడం జరిగిందన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కావలసిన సదుపాయాలను ఒక్కొక్కటిగా కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్ , ఏ.ఆర్. డీఎస్పీ ఎం.డి.హెచ్ ప్రేమ్ కుమార్, బాపట్ల,చీరాల, రేపల్లె డీఎస్పీలు వెంకటేశులు, ఎస్.ప్రసాదరావు ,టి.మురళీ కృష్ణ , ఎస్.బి ఇన్స్పెక్టర్ వి.సూర్యనారాయణ, అడ్మిన్ ఆర్.ఐ ఎల్.మన్మథరావు , వెల్ఫేర్ ఆర్.ఐ బి.శ్రీకాంత్ నాయక్ , హోమ్‌గార్డ్స్ ఆర్.ఐ ఎల్. గోపీనాథ్, బాపట్ల రూరల్ సీఐ జి.వేణుగోపాలరెడ్డి , సీసీఎస్ ఇన్స్పెక్టర్ ఎల్.వీరనాయక్ ,బి.డి టీమ్ ఆర్.ఎస్.ఐ ఎమ్. శ్రీనివాసులు , వెదుళ్ళపల్లి ఎస్సై ఎమ్.అనిత పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటేటర్ కేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో రేణంగివరం-కొరిశపాడు జాతీయ రహదారిపై నిర్మించిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటేటర్ కేంద్రం ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాషా తెలిపారు. జాతీయ రహదారిపై నిర్మించిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటేటర్ కేంద్రం వినియోగంపై జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులతో కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో గురువారం సమావేశం జరిగింది. ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటేటర్ కేంద్రాన్ని భవిష్యత్తు అవసరాల కొరకు జాతీయ రహదారిపై నిర్మించినట్లు కలెక్టర్ చెప్పారు. బాపట్ల జిల్లా పరిధిలో రేణంగివరం-కొరిశపాడు జాతీయ రహదారిపై నిర్మించిన కేంద్రాన్ని భారత ప్రభుత్వం వినియోగంలోకి తీసుకురానుందన్నారు. వైమానిక దళానికి సంబంధించిన విమానాలు, హెలికాప్టర్లు ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటేటర్ వద్ద నిలుస్తాయన్నారు. జాతీయ రహదారిపై నిర్మించిన కేంద్రాన్ని ఈనెల 15 నుంచి 30వ తేదీ లోగా ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ కేంద్రాన్ని ప్రారంభించడానికి పోలీసుల సంరక్షణ చర్యలపై ఆయన చర్చించారు.ఈ సమావేశంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ దేవేష్ గోయల్, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

విశాలాంధ్ర-పర్చూరు: పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలని రాష్ట్ర బాలల హక్కుల సంరక్షణ కమీషన్ సభ్యులు బత్తుల పద్మావతి తెలిపారు. గురువారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు, గురుపాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో, గురుకులాలలో మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉండాలని, విద్యా ప్రమాణాలు పెంచే విధంగా ఉపాధ్యాయుల కృషి చేయాలని తెలిపారు. విద్యార్థుల ఎడల ప్రేమ పూర్వకంగా ఉండాలని, దండనలు, శిక్షలకు ఉపాధ్యాయులు దూరంగా ఉండాలని సూచించారు. ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు ఉంటాయని, బాలికల విద్యను ప్రోత్సహించాలని అన్నారు. పాఠశాలల్లో ఫిర్యాదులు, సలహాల పెట్టెలను ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు సమస్యలు ఉత్పన్నమైనప్పుడు 1098కి కాల్ చేయాలని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల వివరాలను ప్రదర్శించాలని, విద్యార్థుల స్థితిగతులను తెలుసుకొని, వాటిని పరిష్కరించే దిశగా ఉండాలని తెలిపారు. పాఠ్యాంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని పద్మావతి సూచించారు. ఎంఈఓ సత్యనారాయణ, సీడీపీఓ సుభద్ర, అధికారులు ఉన్నారు.

జీవన ప్రమాణాలు పెంచేలా సహకారం

విశాలాంధ్ర - బాపట్ల : మానవీయ కోణంలో అందరికి అందుబాటులో ఉంటూ గ్రామీణ ప్రజలతో మమేకమై అవసరాన్ని అర్థంచేసుకుని ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా సహకారం అందిస్తున్నామని ఎస్‌టు నీడీ ఫౌండేషన్ కార్యదర్శి రమ్య పావని తోట అన్నారు.గురువారం విజయలక్ష్మి పురంలో ఎస్‌టు నీడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అసోది మంజు, గుండుబోయిన లక్ష్మిలకు కుట్టు మిషన్లు బ్లౌజ్,పెట్టికోట్ మెటీరియల్స్ అందించారు.ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి రమ్య పావని తోట మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున్న సహాయ కార్యక్రమ ఫలాలు, అవసరార్థుల పరిస్థితుల రీత్యా విరివిగా సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల కనీస అవసరాలను తీర్చడమే పరమావధిగా,ప్రజల జీవన స్థాయిని పెంచే విధంగా ఆర్థిక అంశానికి ఉన్న ప్రాముఖ్యతను గుర్తుంచి అవసరం కలిగి అవకాశం కోసం చూస్తున్న కుటుంబాలను క్షేత్ర స్థాయిలో గుర్తుంచి వారి నైపుణ్యానికి మెరుగులుదిద్ది ఆర్థిక సుస్థిరత అందుకోవడానికి కావాలసిన వనరుల సహాయం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకురాలు కుందేటి శివకుమారి,గుగ్గిలం గౌతమి,పేర్ల పద్మ,కోకి జయ, కావూరి ఐశ్వర్య,గ్రహీతలు అసోది మంజు, గుండుబోయిన లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

బీహార్‌లో రిజర్వేషన్ పెంపు చారిత్రాత్మకం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బీహార్ రాష్ట్రంలో రిజర్వేషన్లు 50 నుంచి 65 శాతం పెంపు చారిత్రాత్మక నిర్ణయమని సమాజవాది పార్టీ జిల్లా అధ్యక్షుడు మేధ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా మేధ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో కుల జనగణన ఆవశ్యకత దాని ప్రయోజనాల గురించి ములాయం సింగ్ యాదవ్, శరద్ యాదవ్, లాలూప్రసాద్ యాదవ్, అఖిలేష్ యాదవుల చిరకాల పోరాట ఫలితంగా తొలిసారిగా బీహార్‌లో కుల జనగణన జరిపి ఎన్నో అవాంతరాలు ఎదుర్కొని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు జనాభాలో 85 శాతం పైగా ఉన్నారని నితీష్, తేజస్వి యాదవ్ బీహార్‌లో నిరూపించారన్నారు.ఆ సర్వే ప్రకారం నెలకు రూ.6 వేలు ఆదాయం కంటే తక్కువగా ఉండే కుటుంబాలు మొత్తం జనాభాలో మూడో వంతు పైగా ఉండుట చాలా శోచనీయం అని నితీష్ కుమార్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపల్ దాసరి శ్యామ్ లివింగ్ స్టన్, రాష్ట్ర బీసీ నాయకులు ఎనుముల భాస్కర్ గౌడ్, బీసీ బడుగు బలహీన వర్గాల పోరాట యోధుడు ఉప్పాల మురళి, న్యాయవాది అంగలకుదురు నటరాజన్ తదితరులు ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో బహుజన బీసీ నాయకులు మోర్ల చిన్న వెంకటేశ్వరరావు, కొమ్మనబోయిన వెంకట ఫణి కుమార్, బత్తుల వీరయ్య, తోట దుర్గారావుకాంద్రు, శరత్ కుమార్, మరియ బాబు బత్తుల శ్రీనివాసరావు, నక్కల రాంబాబు, దర్శి భాస్కరరావు ,గవిని సుధాకర్, సూరగానీ రాజశేఖర్, మారం రవికుమార్ ,సాంబయ్య, భాను భాస్కర్, యువజన నాయకులు గోపి పాల్గొన్నారు.

విజేతలకు ఎస్పీ బహుమతులు

విశాలాంధ్ర - బాపట్ల : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా ఇటీవల జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు, పోలీస్ శాఖలో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి వేరువేరుగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ చూపిన వారికి ఎస్పీ వకుల్‌జిందాల్ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మెదటి మూడు స్థానాల్లో నిలిచిన వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సమాజం, పోలీసులు, చట్టాల మీద విద్యార్థులకు అవగాహన పెంపొందించడానికి అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్ , ఎస్.బి ఇన్స్పెక్టర్ వి.సూర్యనారాయణ , ఎస్.సి,ఎస్.టి సెల్ ఇన్స్పెక్టర్ ఇ. నారాయణ , వెల్ఫేర్ ఆర్.ఐ బి.శ్రీకాంత్ నాయక్ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.